క్లుప్తంగా

రైతులను ఆదుకోవాలి



పత్తి పంటను పరిశీలిస్తున్న ఇస్మాయిల్

సంగెం : అధిక వర్షాలు, యూరియా కొరతతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని అఖిల భారత రైతు సమాఖ్య జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని కుంటపల్లి, రామచంద్రాపురం, గవిచర్ల గ్రామాల్లో పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు.అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పర్యటించి పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20వేల చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా నాయకుడు రాంచందర్, శ్రీనివాస్, సాంబయ్య, రవి, రాజశేఖర్, వీరస్వామి పాల్గొన్నారు.

నియామకం



దొనికల సదానందం

దుగ్గొండి : మండలంలోని మల్లంపల్లి, చంద్రయ్యపల్లి ఉమ్మడి గ్రామాల గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దొనికల సదానందం, ఉపాధ్యక్షుడిగా కక్కెర్ల ఆనందం, కార్యదర్శిగా కక్కెర్ల సది, కోశాధికారిగా చుక్క రాజేందర్, సహాయ కార్యదర్శిగా మాదారపు యుగందర్, సభ్యులుగా దొనికెల అమరేందర్, బూర రాజు, కక్కెర్ల రాజు, ముంజ శరత్ ఎన్నికయ్యారు.

బీఆర్ఎస్ మండల ఎన్నికల కన్వీనర్‌గా అశోక్



స్వీటు తినిపిస్తున్న పెద్ది

నర్సంపేట : చెన్నారావుపేట బీఆర్ఎస్ మండల ఎన్నికల కన్వీనర్‌గా మాజీ ఎంపీపీ జక్క అశోక్‌ను నియమించినట్లు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రకటించారు. ఎన్నికల కమిటీ సభ్యులుగా బానోత్ పత్తి నాయక్, తూటి శ్రీనివాస్, బోడ బద్దు నాయక్, జున్నుతుల మహేందర్‌రెడ్డి, చెరుకుపల్లి విజేందర్‌రెడ్డిలను నియమించినట్లు బుధవారం తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ నాయకులు, కార్యకర్తలను సమన్వయ పరుస్తూ విజయం సాధించే దిశగా ఈ కమిటీ పని చేస్తోందని చెప్పారు.

ఎంసీపీఐ(యూ) మండల కన్వీనర్‌గా జన్ను రమేశ్



ఎంసీపీఐ(యూ) చెన్నారావుపేట మండల కన్వీనర్‌గా జన్ను రమేశ్‌ను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ తెలిపారు. మండలంలోని పాతమగ్దుంపురం గ్రామానికి చెందిన రమేశ్‌ను పార్టీ మండల కన్వీనర్‌గా నియమించినట్లు బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ ఎంసీపీఐ(యూ) పార్టీ కన్వీనర్‌గా నియమించినందుకు పెద్దారపు రమేష్, మండల బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

చర్య తీసుకోవాలి

వర్ధన్నపేట : పట్టణ కేంద్రంలోని భారతీయ నాటక కళా సమితి ప్రాంగణంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న భారతీయ సినిమా టాకీస్‌పై చర్యలు తీసుకోవాలని పట్టణానికి చెందిన కొండేటి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. బుధవారం వర్ధన్నపేట మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. థియేటర్‌లో కనీస మౌళిక సదుపాయాలు లేవని, అనుమతులు లేకుండా క్యాంటీన్ నడిపిస్తూ అధిక రేట్లకు తినుబండారాలు విక్రయిస్తున్నాడని పేర్కొన్నారు.

ఎస్సీ కాలనీల్లో అభివృద్ధికి మోక్షం

సబ్‌ప్లాన్ కింద ఖానాపురానికి రూ.2.18 కోట్ల నిధులు మంజూరు

- సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాలకు శ్రీకారం



ఎస్సీ కాలనీలో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి, నాయకులు (ఫైల్)

ఖానాపురం : ఎస్సీ కాలనీల్లో పలు అభివృద్ధి పనులకు అడుగులు పడనున్నాయి.. అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంటున్న ఎస్సీ కాలనీలను అభివృద్ధి పథంలోకి తీసుకురావడానికి నిధుల మంజూరయ్యాయి. ఆయా నిధులతో చేపట్టనున్న నిర్మాణాలకు ఎమ్మెల్యే మాధవరెడ్డి శంకుస్థాపనలు సైతం చేశారు. మంజూరైన నిధులతో అభివృద్ధి పనులు చేపడితే కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ పనులకు మోక్షం లభించే అవకాశం ఉంది. ఖానాపురం మండలంలోని ఎస్సీ కాలనీల్లో అభివృద్ధి పనులకు ఇటీవల ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.2.18 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఖానాపురం గ్రామానికి రూ.60 లక్షలు, మనుబోతులగడ్డ, కొత్తూరు, రాగంపేట, రంగాపురం, చిలుకమ్మ నగర్‌కు రూ.36లక్షలు, ధర్మరావుపేటకు రూ.31 లక్షలు, బుధరావుపేట, మంగళవారిపేట గ్రామాలకు రూ.43 లక్షలు, అశోక్‌నగర్, దబ్బీర్‌పేట గ్రామాలకు రూ.48లక్షల నిధులు మంజూరయ్యాయి. ఇందులో కొన్ని పనులకు టెండర్లు పూర్తి కాగా మరికొన్ని పనులకు టెండర్లు పూర్తి కావాల్సి ఉంది. ఎస్సీ కాలనీల్లో పలు చోట్ల నిర్మాణాలు లేక ఇబ్బందులు పడుతుండగా మంజూరైన నిధులతో నిర్మాణాలు పూర్తయితే కాలనీల్లో రోడ్ల సమస్యలు తీరనున్నాయి.

ఎమ్మెల్యే సహకారంతోనే నిధులు



స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో మండలానికి సబ్‌ప్లాన్ నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో త్వరగా పనులు పూర్తి చేయించి కాలనీల్లోని ప్రజల సమస్యలను పరిష్కరిస్తాం. ఎస్సీ కాలనీల్లోని ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తమవంతుగా కృషి చేస్తాం.

– యర్ల జగన్‌మోహన్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు

త్వరలో పనులు ప్రారంభిస్తాం..

ఎస్సీ సబ్‌ప్లాన్ కింద రూ.2.18 కోట్లు మంజూరయ్యాయి. మండలంలోని పలు గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలు చేపట్టే ప్రాంతాలను ఇప్పటికే ఎంపిక చేశాం. ఇందులో కొన్ని గ్రామాల్లో పనులకు టెండర్లు పూర్తయ్యాయి. మరికొన్ని గ్రామాల్లో టెండర్లు పూర్తికావాల్సి ఉంది. పండుగ అనంతరం టెండర్లు పూర్తి చేసి పనులు ప్రారంభిస్తాం. సకాలంలో పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం. – మణితేజరెడ్డి, పీఆర్, ఏఈ

‘స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి’



పర్వతగిరి: మాట్లాడుతున్న దయాకర్‌రావు



నర్సంపేట: మాట్లాడుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట/పర్వతగిరి : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా పర్వతగిరి మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలు, కుల సంఘాలతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో దయాకర్‌రావు మాట్లాడారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి.. చెన్నారావుపేట బీఆర్ఎస్ పార్టీ మండల కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం వారు వేర్వేరుగా మాట్లాడుతూ.. రానున్న స్థానిక ఎన్నికల్లో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికలకు దిశా నిర్దేశం చేశారు. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు సత్తా చాటాలని, కష్టపడే ప్రతీ కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని పేర్కొన్నారు. మార్పులో భాగంగా నర్సంపేట నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అవకాశం కల్పించి ఎమ్మెల్యేగా దొంతి మాధవరెడ్డిని గెలిపిస్తే అభివృద్ధి అథోగతిపాలైందని సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. ప్రత్యేక నిధులతో చెన్నారావుపేట మండలంలో బ్రిడ్జిలు, చెక్‌డ్యాంలు, డబుల్ రోడ్లు, సెంట్రల్ లైటింగ్ మంజూరు చేశామన్నారు. రైతులకు యూరియా సరిపడా అందక పంటల దిగుబడి కోల్పోయారని, పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ శ్రేణులు కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పని చేసి చెన్నారావుపేట మండలంలో గులాబీ జెండా ఎగురవేయాలని సూచించారు. ఆయా సమావేశాల్లో జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు, యూత్, సోషల్ మీడియా నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఐనవోలు : మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య అన్నారు, బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో మండలంలోని వెంకటాపూర్ గ్రామంలోని సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా లింగయ్య మాట్లాడుతూ గ్రామంలో బీసీ, ఎస్సీ కాలనీల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నట్లు తెలిపారు. చిన్న వర్షానికి నీరు రోడ్లపై చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు వాపోయారు.

బాధిత కుటుంబాలకు చేయూత



రాయపర్తి: ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు



దుగ్గొండి: సాయం అందజేస్తున్న మిత్రులు



నెక్కొండ: బియ్యం అందజేస్తున్న రఘోత్తంరెడ్డి

రాయపర్తి : మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన గొలుసుల ఒగ్గయ్య ఇటీవల మృతిచెందాడు. కాగా బాధిత కుటుంబ సభ్యులను బుధవారం స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ సభ్యులు పరామర్శించారు. మృతుడి కుమారుడు గొలుసుల భాస్కర్‌ను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం రూ.5వేలు ఆర్థికసాయాన్ని అందజేశారు. యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు ముద్రబోయిన శ్రీనివాస్, అధ్యక్షుడు చెనబోయిన కుమార్, గౌరవ అధ్యక్షుడు బొనగిరి సతీష్, అందె వెంకటమల్లయ్య, కత్తి సుధాకర్, రవి, శ్రీనివాస్, సురేష్, సాగర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి..

దుగ్గొండి : మండలంలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన కసిపోజుల బ్రహ్మం ఆర్థిక ఇబ్బందులతో వ్యవసాయ బావిలో దూకి ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. బాధిత కుటుంబ సభ్యులను 1995–96 సంవత్సరంలో పదో తరగతి చదివిన మిత్రులు బుధవారం పరామర్శించి, రూ.30వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. పెండ్లి రవి, ముద్రబోయిన రమేష్, కత్తి రాజు, రామగిరి రజనీకాంత్, సంకట రజిత, కోరం రజనీకాంత్, సంకటి రవి, కృష్ణంరాజు, రఘుపతిరెడ్డి, కుమారస్వామి, శ్రీనివాసరెడ్డి, యాదగిరి, భాస్కర్, భాస్కర్, క్రాంతికుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన మాజీ మంత్రి

రాయపర్తి : మండలంలోని పెర్కవేడు గుంటూరుపల్లికి చెందిన మాకినేని వీరయ్య, శివరామపురం సుభాష్‌తండాకు చెందిన భూక్య చంద్యానాయక్ ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు బుధవారం పరామర్శించారు. మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. అనంతరం సూర్యతండాలో లైన్‌మెన్‌గా పని చేస్తుండగా ప్రమాదవశాత్తు గాయపడిన మూనావత్ హన్మంతు, యూరియా బస్తాల క్యూలో గాయపడిన మూనావత్ మంజ్యానాయక్. మొరిపిరాల శివారు జానకమ్మబండతండాలో గాయపడిన రాందాస్ నాయక్, అనారోగ్యంతో బాధపడుతున్న మొరిపిరాలకు చెందిన పారుపల్లి సుధాకర్‌రెడ్డిని పరామర్శించారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మూనావత్ నర్సింహానాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, పూస మధు, రంగారెడ్డి, చిన్నాల రాజబాబు, జాజు నాయక్, బొమ్మెర వీరస్వామి, ఆకుల సమ్మయ్య, మాకినేని పెద్ద కృష్ణారావు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

నెక్కొండ : గ్రామపంచాయతీలో మల్టీపర్పస్ వర్కర్‌గా పనిచేస్తున్న ఈదునూరి భిక్షపతి భార్య రమణి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది, కాగా పలువురు బాధిత కుటుంబానికి పరామర్శించారు. బుధవారం విద్యుత్ శాఖ రిటైర్డ్ ఏఈ చల్లా రఘోత్తంరెడ్డి ఆర్థికసాయం, అర క్వింటా బియ్యం అందించారు. ఈదునూరి యాకయ్య, కందిక చెన్నకేశవులు, కృష్ణారావు, సారంగపాణి, ప్రభాకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి సన్మానం



పర్వతగిరి : మండలంలోని కల్లెడలో గల ఆర్డీఎఫ్–వనితా అచ్యుతా పాయి జూనియర్ కళాశాల విద్యార్థిని బండారు స్వాతి సూర్యాపేట ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. దీంతో కళాశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, అధ్యాపకులు బుధవారం స్వాతికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి అభినందించారు.

గుంతలరోడ్డుపై దిగబడిన డీసీఎం



పర్వతగిరి : పర్వతగిరి మండల కేంద్రం నుంచి నెక్కొండ మండలానికి వెళ్లే ప్రధాన రోడ్డు పోలుకమ్మ చెరువు కట్ట వద్ద వర్షాలతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. ఇటీవల డీసీఎం ఆ గుంతలో దిగబడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఆర్టీసీ బస్సులు, ప్రయాణికులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కట్టపై నుంచి భారీ వాహనాలు వెళ్లడంతో పెద్దపెద్ద గుంతలు పడి వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.

రైతులకు తప్పని యూరియా కష్టాలు



సంగెం: రైతు వేదిక వద్ద క్యూలో ఉన్న రైతులు



పర్వతగిరి: రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

సంగెం : మండలంలోని రైతులకు యూరియా కొరత వేధిస్తోంది. అరకొరగా సరఫరాతో అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. బుధవారం సంగెం సొసైటీకి 444 బస్తాల యూరియా వచ్చిందని తెలిసి అర్ధరాత్రి నుంచి పలు గ్రామాల రైతులు రైతు వేదిక వద్ద క్యూలో వేచి ఉన్నారు. సంగెం ఎస్సై నరేష్‌ల ఆధ్వర్యంలో పోలీసుల పహారా నడుమ ఎరువుల కార్డులతో వచ్చిన రైతులకు ఒక బస్తా చొప్పున పంపిణీ చేశారు. పలువురు రైతులకు యూరియా దొరకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. ఈ కష్టాలు తీరెదేన్నడోనని యూరియా లేకుంటే పంటలు ఎలా పండించాలంటూ ఆవేదన వ్యక్తంచేస్తు ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు.

యూరియా కొరతతో రైతుల గోస

పర్వతగిరి : మండలంలోని రైతులకు సరిపడా యూరియా అందక అరిగోస పడుతున్నారు. యూరియా కోసం అర్ధరాత్రి నుంచే క్యూలో నిల్చున్న సమయానికి అధికారులు రాక, సరిపడా యూరియా రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదే విషయంపై బుధవారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు రైతులు తమ గోడును వెళ్లబోసుకున్నారు. స్పందించిన దయాకర్‌రావు మండలంలోని కల్లెడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలోకి వెళ్లి రైతుల దీనస్థితికి చలించి సంబంధిత అధికారులకు ఫోన్ చేసి రైతుల బాధలు తెలియజేసి తక్షణమే యూరియా అందించాలని డిమాండ్ చేశారు. రైతులు పొద్దంతా తిండి తిప్పలు లేక ఎరువుల కోసం ఎదురు చూస్తున్న వారికి ఒక బస్తా ఇచ్చి మభ్య పెడుతున్నారని మండిపడ్డారు. ప్రజాపాలన అని చెప్పుకునే ఈ ప్రభుత్వం ప్రజలను రాక్షసులుగా వేధిస్తున్నారని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో రాజులుగా బతికిన రైతులు ఈ దుర్మార్గపు పాలనలో ఎరువుల కోసం రైతులు అధికారుల కాళ్లు పట్టుకునే స్థితికి వచ్చారని తెలిపారు. ఎరువుల సరఫరాలో అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం విఫలమయ్యాయని దుయ్యబట్టారు. నాడు కేసీఆర్ హయాంలో ఆరు నెలల ముందే ఎరువులు నిల్వ చేసి రైతులకు కొరత లేకుండా చూసే వారని వివరించారు.

సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు

పర్వతగిరి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సూర్యఘర్–ముఫ్త్ బిజిలీ యోజన పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఫీల్డ్ ఆఫీసర్ నవీన్‌కుమార్ కోరారు. బుధవారం మండల కేంద్రంలో ప్రజలకు అవగాహన కల్పించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యఘర్–ముఫ్త్ బిజిలీ యోజనలో 1 కేడబ్ల్యూ సామర్థ్యానికి రూ.30వేల సబ్సిడీ, 2 కేడబ్ల్యూ రూ.60వేల సబ్సిడీ, 3 కేడబ్లూ–10కేడబ్ల్యూ రూ.78వేల సబ్సిడీ ఉంటుందని తెలిపారు. జిల్లా మేనేజర్ రాజేందర్, ఏడీఈ తిరుపతి, పంచాయతీ కార్యదర్శి రఘు, చింతపట్ల సోమేశ్వర్‌రావు, పిన్నింటి అనిల్‌కుమార్, సునీల్‌రావు, రాంచందర్, మల్లికార్జున్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఏసీపీ వెంకటేశ్, సీఐ రాజగోపాల్, ఎస్సై శ్రీనివాస్, సిబ్బంది

ఐనవోలు : బతుకమ్మ పండుగ, దసరా సెలవుల సందర్భంగా ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని మామునూరు ఏసీపీ ఎన్.వెంకటేశ్ అన్నారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్వతగిరి ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్, ఎస్సై శ్రీనివాస్‌తో పాటు సిబ్బంది బైక్‌లపై పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మ ఆడే స్థలాలను ఆయన పరిశీలించారు. అదే విధంగా ఆయా గ్రామాల్లో సీసీ కెమెరాల పనితీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. వరుసగా సెలవులు రావడంతో దొంగతనాలు జరిగే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మహిళలు బతుకమ్మ వేడుకలు జరిగే ప్రాంతంలో జాగ్రత్త వహించాలని సూచించారు. బతుకమ్మ, దసరా వేడుకల్లో గొడవలు జరగకుండా చూసుకోవాలని కోరారు. నేరాల నియంత్రణకు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, సైబర్ నేరాల గురించి వివరించారు. అనుమానాస్పద వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు.



నర్సంపేట: అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



ఖానాపురం: బుధరావుపేటలో..



దుగ్గొండి: నాచినపల్లి రామాలయంలో..

కొనసాగుతున్న దేవి నవరాత్రి ఉత్సవాలు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లావ్యాప్తంగా దేవి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం పలు గ్రామాల్లో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు అమ్మవారు చంద్రఘంట అలంకరణ అన్నపూర్ణాదేవిగా, గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. మహిళలు అమ్మవారిని గాజులతో అలంకరించారు. పూజలో మహిళలు, కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట: అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న దేవాలయ కమిటీ బాధ్యులు



సంగెం: ఆశాలపల్లి రేణుకా ఎల్లమ్మ ఆలయంలో..




గీసుకొండ: అన్నపూర్ణాదేవి రూపంలో అమ్మవారు



వర్ధన్నపేట: పూజలో పాల్గొన్న భక్తులు


చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



సంజీవ్ (ఫైల్)

సంగెం : మనస్తాపంతో గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కుంటపల్లికి చెందిన కద్దూరి సంజీవ్ (47), అరుణ దంపతులు వ్యవసాయం చేస్తు కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఈ నెల 17న సంజీవ్ మద్యం తాగి ఇంటికి రాగా భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన సంజీవ్ క్షణికావేశంలో గడ్డి మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తుండగా బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాకేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు



క్షతగాత్రుడు సోమ

వర్ధన్నపేట : పట్టణ శివారు జాతీయ రహదారిపై ఆగి ఉన్న ట్రాక్టర్‌ను బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన బుధవారం రాత్రి జరిగింది. మండలంలోని రామోజీ కుమ్మరిగూడెం తండాకు చెందిన భూక్య సోమ గుబ్బేటి తండాకు వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రుడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు.